సాక్షి
కర్నూలు
బుధవారం ၊ 1 ၊ జనవరి ၊ 2025



నీలకంఠుడికి నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై మంగళవారం కాకినాడ శాస్త్రీయ నృత్య కళాకారుల సంక్షేమ సమాఖ్య వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



క్యాలెండర్ ఆవిష్కరణ

కర్నూలు(సెంట్రల్): లోకాయుక్త నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఉప లోకాయుక్త జస్టిస్ పి.రజని మంగళవారం ఆవిష్కరించి ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



శనగల బసవన్నకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్రంలో శనగల బసవన్న, బయలువీరభద్ర స్వామికి మంగళవారం ఆలయాధికారులు పంచామృతాలతో అభిషేకాది అర్చనలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

వ్యవసాయ ఉద్యోగుల నూతన కార్యవర్గం ఎన్నిక



ఉమ్మడి జిల్లా వ్యవసాయ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం

కర్నూలు(అగ్రికల్చర్):ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి అనుబంధంగా ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యవసాయ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం మంగళవారం ఏకగ్రీవంగా ఏర్పాటైంది. ఏపీజీఈఏ జిల్లా శాఖ అధ్యక్షుడు బంగి శ్రీధర్, రాష్ట్ర వ్యవసాయ ఉద్యోగుల సంఘం నేతలు రఘురామ నాయుడు, డీ.శ్రీహరి ముఖ్య అతిథులుగా హాజరై ఎన్నిక కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఎం.శ్రీహరి(నంద్యాల జిల్లా), కార్యదర్శిగా హెచ్.రూపేష్‌కుమార్ (కర్నూలు జిల్లా), సహా అధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా సాయికుమార్, ఉపా ధ్యక్షులుగా సునీల్‌కుమార్, ఎండీ ఆలీ, దివాక ర్, సంయుక్త కార్యదర్శులుగా జయరాజు, పి.కిశోర్, శివకమార్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా రాజేష్, అలేఖ్య, జిల్లా ఈసీ మెంబర్లుగా జయరాములు, సాంబశివుడు, రాష్ట్ర ఈసీ మెంబరుగా విజయకుమార్ ఎన్నిక య్యారు. తర్వాత వీరు ప్రమాణ స్వీకారం చేశా రు. అనంతరం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి 2025 టేబుల్ క్యాలండర్ విడుదల చేశారు.

నేడు స్పర్శదర్శనం నిలుపుదల

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో బుధవారం ఐచ్ఛిక సెలవు కారణంగా భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని, ఈ కారణంగా స్వామివార్ల స్పర్శదర్శనం పూర్తిగా నిలుపుదల చేసినట్లు శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

ఆశల వెలుగుకు స్వాగతం



- అంబరాన్నంటిన న్యూ ఇయర్ వేడుకలు
- 2025కు ఘన స్వాగతం పలికిన జిల్లా ప్రజలు
- అర్ధరాత్రి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు చెప్పుకున్న ప్రజలు



మంగళవారం అర్ధరాత్రి కర్నూలు నగరంలో నూతన సంవత్సర సంబరాల్లో యువత

కర్నూలు కల్చరల్: నూతన సంవత్సరం ప్రారంభమయ్యే క్షణాన ఆనందం మెరుపులా మెరిసింది. ఉత్సాహం ఆకాశాన్ని తాకింది. ఆశలు.. ఆశయాలను నిజం చేస్తూ తమను విజయ పథాన నిలుపుతుందనే ఆకాంక్షలతో జిల్లా ప్రజలు నూతన ఏడాదికి స్వాగతం పలికారు. సంబరాలు మిన్నంటే వేళ నింగి నేల కాంతుల హేల.. మది నిండా మధుర స్మృతులతో 2024కు వీడ్కోలు.. కోటి ఆశలతో కొత్త సంవత్సరానికి స్వాగతాలు.. ఉప్పొంగిన ఉత్సాహంతో హ్యాపీ న్యూ ఇయర్ అంటూ.. అన్నీ మంచి శకునాలే అనుకుంటున్న జిల్లా ప్రజలు మంగళవారం అర్ధరాత్రి తర్వాత కొత్త ఏడాదిలోకి అడుగు పెట్టారు. బాణాసంచా కాలుస్తూ కేకులు కట్ చేస్తూ మిఠాయిలు పంచుకున్నారు. నయా సాల్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కర్నూలు, నంద్యాల, ఆదోని, డోన్, ఆళ్లగడ్డ, పత్తికొండ తదితర పట్టణాల్లో యువత సంతోషంగా గడిపారు. ఉత్సాహంతో 2025 సంవత్సరానికి స్వాగతం పలికారు

కాలంలో కలిసిపోయిన మరో సంవత్సరం

కాలగర్భంలో మరో ఏడాది 2024 కలిసిపోయింది. నూతన సంవత్సరం 2025లోకి కొంగొత్త ఆశలతో అడుగుపెట్టాం. గతం మనకు కొంత మంచిని కొంత చెడును మిగిల్చి ఉండొచ్చు. పాత కొత్త కలయికలను నెమరు వేసుకుంటూ జీవితాన్ని ఆశావహ దృక్పథంతో నిర్మించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరికి ఉంది. గడిచిన సంవత్సరంలో ఎంతో మందికి ఎన్నో మధుర జ్ఞాపకాలు ఉంటాయి. మరి కొందరికి చేదు అనుభవాలు కూడా ఉంటాయి. చేదు అనుభవాలను గుణపాఠాలుగా భావించి మధుర జ్ఞాపకాలను పాఠ్యాంశాలుగా అనుకుంటే కొత్త జీవితం ప్రగతి మార్గంలో పయనిస్తుంది. ఈ నూతన సంవత్సరంలో కొత్త ఆశలతో ప్రతి మనిషి ముందుకు సాగిపోవాలని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరుకోవడం సహజం. అయితే ఆశకు తగిన కృషి కూడా ఉండాలి. ముఖ్యంగా యువత పరుగులెత్తే వయసులో విజ్ఞానం పేరుతో కొత్తదనం పేరుతో చెడు మార్గంలో పయనిస్తే తమ కుటుంబంతో పాటు సమాజానికి, దేశానికి అపారమైన నష్టం కలుగుతుందనే విషయాన్ని గ్రహించాలి.

మార్కెట్‌లో జోరుగా విక్రయాలు..

2025కు స్వాగతం వేళ మార్కెట్‌లో క్రయ విక్రయాలు జోరుగా సాగాయి. గ్రామాలు మొదలుకొని కర్నూలు నగరం వరకు ఎక్కడ చూసినా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ దర్శనమిచ్చాయి. మాంసాహారం దుకాణాలు, రెస్టారెంట్లు, హోటళ్లు, నర్సరీలు, ఫ్లవర్ దుకాణాలు, స్వీట్స్ షాప్స్, కూల్ డ్రింక్స్, బేకరీల్లో కేక్‌లతో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశారు.

కూటమి ప్రభుత్వంపై ఉద్యమాలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ

IIలో ▶

తూతూ మంత్రంగా..

- గంటన్నర పాటే ఇంటిదగ్గర పింఛన్ల పంపిణీ
- తర్వాత సచివాలయాలు, రచ్చబండ వద్ద అందజేత



పెన్షన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(అగ్రికల్చర్)/ నంద్యాల (అర్బన్): ఇంటి దగ్గరే పింఛన్ల పంపిణీ మాటలకే పరిమితమైంది. జనవరి నెలకు సంబంధించిన పంపిణీ కూడా సచివాలయాలు, రచ్చబండల దగ్గరే జరిగింది. 1వ తేదీ నూతన సంవత్సర వేడుకలు జరుగుతుండటంతో ఒకరోజు ముందుగానే అంటే ఈనెల 31వ తేదీన పింఛన్లు పంపిణీ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మంగళవారం ఉదయం కొద్దిసేపు వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులు ఇంటి దగ్గర పంపిణీ జరగగా ఆ తర్వాత యథాప్రకారం సచివాలయాలు, రచ్చ బండల దగ్గరకు మారింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పింఛన్ల పంపిణీ జరగడం ఏడోసారి .అయితే ఇప్పటి వరకు ఒకసారి కూడా పూర్తిస్థాయిలో ఇంటి దగ్గర పింఛన్ల పంపిణీ విజయవంతంగా జరగలేదు. దీంతో వేలాది మంది వికలాంగులు, వయోవృద్ధులు, కిడ్నీ బాధితులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో వలంటీర్లు ఐదేళ్ల లబ్ధిదారులకు ఇంటి దగ్గరే పింఛన్ సొమ్ము అందజేశారు. దీంతో అవ్వాతాతలు, వికలాంగులు, వ్యాధి గ్రస్తులు ఎవరూ ఇబ్బంది పడలేదు. తెలుగుదేశం, జనసేన పార్టీల కుట్రల వల్ల ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పింఛన్‌దారులకు కష్టాలు మొదలయ్యాయి.

కర్నూలులో 95.95 శాతం పంపిణీ...

జనవరి నెలకు సంబంధించి ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కర్నూలు జిల్లా 8వ స్థానంలో నిలిచింది. జిల్లాలో 2,39,818 పింఛన్‌దారులుండగా.. సాయంత్రం 6 గంటల సమయానికి 2,30,108 (95.95 శాతం)మందికి పింఛన్ అందజేశారు. ఇదిలా ఉంటే జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా మంగళవారం ఉదయం జొహరాపురం రోడ్డులోని లక్ష్మీగార్డెన్స్ పూల సుబ్బయ్య నగర్‌లో లక్ష్మీదేవి (దివ్యాంగురాలు), రామలక్ష్మి(వితంతువు), నాగమణి (ఒంటరి మహిళ) తదితర లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు.

ఉద్యోగమే లక్ష్యంగా బరిలోకి..

- కానిస్టేబుల్ ఎంపిక పరీక్షలకు రెండో రోజు 266 మంది హాజరు
- తుది రాత పరీక్షకు 197 మంది ఎంపిక



కాలుకు ఉన్న సెన్సార్ చిప్‌ను కంప్యూటర్‌కు అనుసంధానం చేస్తున్న సాంకేతిక సిబ్బంది

కర్నూలు: తలపై టోపీ... చేతిలో లాఠీ... ఒంటిపై ఖాకీ డ్రస్సుతో పోలీసుగా తమను తాము చూసుకోవాలనేది చాలా మంది కల. దీనిని సాకారం చేసుకోవడమే లక్ష్యంగా పలువురు అభ్యర్థులు పోలీసు కానిస్టేబుల్ ఎంపిక పరీక్షల్లో బరిలో దిగి ప్రతిభ కనబరిచారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన ప్రాథమిక పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన కానిస్టేబుల్ అభ్యర్థులకు కర్నూలు ఏపీఎస్పీ రెండో పటాలంలో శారీరక సామర్థ్య, దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. రెండోరోజు మంగళవారం ఉమ్మడి జిల్లాకు చెందిన 600 మంది పురుష అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 266 మంది హాజరయ్యారు. వారికి ఎత్తు, ఛాతీ విస్తీర్ణం తదితర పరీక్షలు నిర్వహించి అనంతరం అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించి మైదానంలోకి అనుమతించి పరుగు, లాంగ్‌జంప్ పోటీలు జరిపారు. ముందుగా 1600 మీటర్ల పరుగు పందెంలో నిర్ణీత సమయానికి చేరుకున్న వారికి 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పోటీలు నిర్వహించారు. వీటిలో ఉత్తీర్ణత సాధించిన వారికి అర్హత పత్రాలు అందజేశారు. తుది రాత పరీక్షకు 197 మంది ఎంపికయ్యారు.

వివరాలు కంప్యూటర్‌లో నిక్షిప్తం...

పోలీసు అభ్యర్థుల శారీరక సామర్థ్య, దేహదారుఢ్య, పరుగు పందెంలకు సంబంధించిన మొత్తం సమాచారాన్ని ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానంతో కంప్యూటర్‌లో నమోదు చేసి భద్రపరుస్తున్నారు. బయోమెట్రిక్ పూర్తి చేసిన తర్వాత ప్రతి అభ్యర్థి కాలికి చిప్‌తో కూడిన రిస్ట్ బ్యాండ్ తగిలించుకుని పోటీల్లో పాల్గొన్నారు. రెండేళ్ల క్రితం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రాథమిక ఎంపిక రాత పరీక్షలు పూర్తి చేయగా తాజాగా అధికారులు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. కేటాయించిన తేదీల్లో గైర్హాజరైనవారికి మరో అవకాశం ఇవ్వనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

పెద్దాసుపత్రిలో వృద్ధునికి అరుదైన శస్త్రచికిత్స

కర్నూలు(హాస్పిటల్): మూత్ర సమస్యతో బాధపడుతూ యూరిన్ బ్యాగ్ చేతబట్టుకుని తిరుగుతూ నిత్యం నరకం అనుభవించే వృద్ధునికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల యురాలజీ విభాగం వైద్యులు ఆ బాధ నుంచి విముక్తి కలిగించారు. మంగళవారం యురాలజీ హెచ్‌ఓడీ, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సీతారామయ్య వివరాలను వెల్లడించారు. ఆదోనికి చెందిన సుదర్శనరావు(74) ఆర్ అండ్ బీ కార్యాలయంలో ఉద్యోగం చేసి పదవీ విరమణ చెందారు. ప్రస్తుతం ఆయన అనంతపురంలో కూతురి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆయనకు మూత్రాశయంలో సమస్య ఏర్పడింది.


డాక్టర్ సీతారామయ్యను సన్మానిస్తున్న సుదర్శన్‌రావు, వైద్యుల బృందం

వైద్యులు అతనికి యూరినరీ బ్యాగ్‌ను అమర్చాల్సి వచ్చింది. ఎక్కడికి వెళ్లినా బ్యాగ్‌ను వెంట బెట్టుకుని వెళ్లాల్సి వచ్చేది. ఈనెల 21న కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని యురాలజీ విభాగంలో చేరారు. అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు చేయించిన వైద్యులు ప్రోస్టేట్‌లో సమస్య ఉన్నట్లు గుర్తించి డిసెంబర్ 27న డాక్టర్ సీతారామయ్య ఆధ్వర్యంలో వైద్యుల బృందం శస్త్రచికిత్స నిర్వహించారు. ఆయన కోలుకోవడంతో మంగళవారం డిశ్చార్జ్ చేశారు. కృతజ్ఞతగా డాక్టర్ సీతారామయ్యను సుదర్శన్‌రావు సన్మానించారు. ఆపరేషన్ చేసిన వారిలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ముత్యశ్రీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బాల రవితేజ, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ మహేష్‌నాయక్, పీజీలు లయాఖ్ ఫాతిమా, హిమజ, ప్రశాంత్, ఉమామహేశ్వర్, రవీంద్రనాథ్, సాయిసుదీప్ ఉన్నారు.

జర్నలిస్టుల అక్రిడేషన్ గడువు పొడిగింపు

నంద్యాల: వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడేషన్‌ల గడువును జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు (2 నెలలు) రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ రాజకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తే చర్యలు


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పి.సింధు సుబ్రహ్మణ్యం. చిత్రంలో సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గైనిక్ విభాగంలో చికిత్స కోసం వచ్చే రోగుల నుంచి ఏఎన్‌ఎం, సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది డబ్బు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మంగళవారం ఆయన హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పి.సింధు సుబ్రహ్మణ్యంతో కలిసి ఆసుపత్రిలోని పలు విభాగాలను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా రూ.3 కోట్ల గ్రాంట్ మంజూరైందని, ఇందులో హాస్పిటల్‌కు సంబంధించిన సివిల్ వర్క్స్, డ్రైనేజీ మరమ్మతులు, ఎలక్ట్రికల్ వర్క్ ద్వారా ఆసుపత్రిని అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. గైనిక్ విభాగంలో బాత్‌రూమ్‌ల మరమ్మతులు, ఫార్మసీ విభాగంలో బాత్‌రూమ్‌ల కోసం అంచనా ఇవ్వాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి ఆవరణలో ఉన్న డ్రైనేజీ మరమ్మతులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆసుపత్రిలో అన్ని విభాగాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని శానిటేషన్ సిబ్బందికి ఆదేశించారు. ఆయన వెంట ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సీతారామయ్య, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాలనాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, న్యూ డయాగ్నోస్టిక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ ప్రశాంత్, ఆసుపత్రి ఏడీ రమేష్‌బాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్–2 విమలమ్మ ఉన్నారు.

విద్యుదాఘాతంతో రెండు ఆవుల మృతి



బనగానపల్లె రూరల్: మండలంలోని యనకండ్ల గ్రామంలో విద్యుదాఘాతంతో రెండు గోవులు మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు వివరాలు.. గ్రామంలోని శ్రీకృష్ణ మందిరానికి చెందిన గోవులు గ్రామసమీపంలోని పెట్రోల్‌బంకు వద్ద మేత మేస్తుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఎలాంటి రక్షణ గోడ లేకపోవడంతోనే గోవులు మృతి చెందాయని శ్రీ కృష్ణమందిరం నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లాకిన్స్‌లా నుంచి 614 క్యూసెక్కుల నీటి విడుదల


కేసీ కెనాల్‌లో ప్రవహిస్తున్న నీరు

పాములపాడు: కేసీ కెనాల్ 120వ కిలో మీటరు లాకిన్స్‌లా నుంచి 614 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సుంకేసుల నుంచి కేసీ కాల్వలోకి 800 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. కాగా మండలంలోని శాంతి నిలయం గ్రామ సమీపంలోని లాకిన్స్‌లా నుంచి తూడిచెర్ల సబ్‌చానల్‌కు 570 క్యూసెక్కులు, అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు 34 క్యూసెక్కులు, నిప్పులవాగుకు 10 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నామని వివరించారు.

ఘనంగా ఖాదర్‌లింగ స్వామి జన్మదిన వేడుకలు

కౌతాళం: మండల కేంద్రంలో వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. తెల్లవారు జామున 5 గంటలకు ప్రత్యేక ఫాతెహాలు అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. సాయంత్రం దర్గాలో ప్రత్యేక ఫాతెహాల అనంతరం స్వామి చిత్రపటానికి పూలమాల వేసి గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. వేడుకల్లో జిల్లా నలుమూలల నుంచే గాక మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించుకున్నారు. కాగా ఆచారం ప్రకారం స్వామి చిత్రపటాన్ని గ్రామానికి చెందిన లింగాయితీ వంశస్తులు తలపై మోసుకొని ఊరేగింపు నిర్వహించడం హిందూ, ముస్లిం ఐక్యతను చాటి చెప్పింది.


దర్గాలో ఫాతెహాలు చేస్తున్న దృశ్యం

కూటమి ప్రభుత్వంపై ఉద్యమాలు

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

కర్నూలు(అర్బన్): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు కూటమి ప్రభుత్వంపై పోరాటాలు చేస్తూనే ఉంటామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. సీపీఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా మంగళవారం కర్నూలులోని జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ మీదుగా సీపీఐ కార్యాలయం సీఆర్ భవన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన చంద్రబాబు.. ఇప్పుడు మాట మార్చి విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలను మోసం చేశారన్నారు. సొంత ఇల్లు లేని పేదవారికి పల్లెల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల స్థలం ఇస్తామని చెప్పిన హామీపై ఇంత వరకు అతీగతీ లేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు రవాణా సౌకర్యం కల్పిస్తామని చెప్పిన చంద్రబాబు అధ్యయనం పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. పల్లె దీవెన, రైతు బంధు పథకాలు అమలు చేస్తామని హామీలు ఇచ్చి ఆరు నెలలు గడిచినా అమలు చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు.


భారీ ర్యాలీలో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జిల్లా నాయకులు, కార్యకర్తలు

పోరుబాటలో భాగంగా 2 నుంచి 10వ తేదీ వరకు పేద వారికి ఇంటి స్థలాలు, సొంత స్థలాలు ఉన్న వారికి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నామన్నారు.

ధరలను అదుపు చేయలేని బీజేపీ..

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ధరలను అదుపు చేయడం లేదని రామకృష్ణ ఆరోపించారు. బీజేపీ నేతలు మతాన్ని అడ్డుపెట్టుకొని అధికారాన్ని చేజిక్కించుకుని పబ్బం గడుపుకుంటున్నారన్నారు. రైతుల కష్టాలు తీర్చడం లేదని, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడం లేదన్నారు. పార్లమెంట్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరిచారన్నారు. వీరికి రాజ్యాంగం పట్ల నమ్మకం కూడా లేదన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా అంబేడ్కర్‌ను అవమానించిన ఘటనలో ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే రామాంజనేయులు, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్ లెనిన్‌బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు కే జగన్నాథం, సహాయ కార్యదర్శి ఎస్. మునెప్ప పాల్గొన్నారు.

5న కురువ వివాహ పరిచయ వేదిక

కర్నూలు(అర్బన్): స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలోని మండల పరిషత్ సమావేశ భవనంలో ఈ నెల 5వ తేదీ ఉదయం 10 గంటలకు కురువ, కురుబ, కురుమ కులస్థుల వివాహ పరిచయ వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కురువ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్తికొండ శ్రీనివాసులు, ఎంకే రంగస్వామి తెలిపారు. ఈ వేదికకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం స్థానిక కార్యాలయ ఆవరణలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని కురువ సామాజిక వర్గానికి చెందిన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ అవివాహిత పిల్లలకు వివాహాలు చేసేందుకు ఈ వేదిక ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అసోసియేట్ అధ్యక్షులు గుడిసె శివన్న, మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు టీ శ్రీలీల, కే అనితాలక్ష్మి, తేజశ్విని, నాయకులు కేసీ నాగన్న, బీ వెంకటేశ్వర్లు, కే ధనుంజయ, బీ రామక్రిష్ణ, తవుడు శ్రీనివాసులు, పాల సుంకన్న, బీసీ తిరుపాలు, పుల్లన్న, దివాకర్ పాల్గొన్నారు.

అమరావతిని ఫ్రీజోన్‌గా ప్రకటించాలి

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర రాజధాని అమరావతిని ఫ్రీజోన్‌గా ప్రకటించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం కర్నూలులోని సీఆర్ భవన్‌లో ఫిబ్రవరి 6 నుంచి 9వ తేదీ వరకు శ్రీకాకుళంలో జరిగే ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభల లోగోను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 జిల్లాల వారికి అమరావతి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధి కల్పనలో విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, చంద్రశేఖర్, నాగరాజు, బీసన్న పాల్గొన్నారు.


లోగోను ఆవిష్కరిస్తున్న ఎన్.లెనిన్‌బాబు

గణితం ప్రకారం ఆకర్షణీయమైన సంఖ్య 2025

కర్నూలు కల్చరల్: గణితం ప్రకారం 2025కు ప్రత్యేకత ఉందని ఇది ఆకర్షణీయమైన సంఖ్య అని ప్రముఖ గణిత ఉపాధ్యాయులు డి.ఈశ్వరయ్య పేర్కొన్నారు. 45×45=2025 ఒక వర్గ సంఖ్య, రెండు వర్గ సంఖ్యల లబ్ధంగా కూడా దీన్ని రాయవచ్చన్నారు. మూడు సంఖ్యల వర్గంగా రాయగలిగిన ప్రత్యేక సంఖ్య కూడా అవుతుందన్నారు. 1936 (44×44) తర్వాత వచ్చిన వర్గ సంఖ్య 2025 అన్నారు. 2025 (45×45)తరువాత మళ్లీ ఇలాంటి వర్గ సంఖ్య 2116లో (46×46) వస్తుందన్నారు. 2025ను మొదట 9 అంకెల ఘనాల (1×3, 2×3, 3×3, 4×3, 5×3, 6×3, 7×3, 8×3, 9×3) మొత్తంగా రాయవచ్చన్నారు.

క్లుప్తంగా

పదవీ విరమణ అధికారులకు వీడ్కోలు



రత్నకుమార్‌ను సన్మానిస్తున్న పోలీసు అధికారులు

కర్నూలు: జిల్లా పోలీసు కార్యాలయ పరిపాలన అధికారి రత్నకుమార్, ఫ్యాక్షన్ జోన్ కానిస్టేబుల్ పెద్దగోస్ మంగళవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు శాఖ తరపున వారిని శాలువా, పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలను అందజేసి ఘనంగా వీడ్కోలు పలికారు. పోలీసు శాఖకు వారు అందించిన సేవలను వక్తలు కొనియాడారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, ఆర్ఐ నారాయణ, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు నాగరాజు, సీసీలు సాకేత్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

వొకేషనల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు సన్మానం



ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్‌ను సన్మానిస్తున్న ఆర్ఐఓ గురవయ్యశెట్టి, డీవీఈఓ పరమేశ్వరరెడ్డి, తదితరులు

కర్నూలు సిటీ: ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్‌ను మంగళవారం ఆ కాలేజీలో ఘనంగా సన్మానించారు. స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా వారు విద్య, సేవా రంగాల్లో విశిష్ట సేవలందించిన నాగస్వామి నాయక్‌కు మహాత్మాగాంధీ అంతర్జాతీయ శాంతి అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఇంటర్మీడియెట్ ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్య శెట్టి, జిల్లా వృత్తి విద్యాధికారి పరమేశ్వరరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని సన్మానించారు. వారు మాట్లాడుతూ మహాత్మగాంధీ జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నాగస్వామినాయక్ గాంధేయ మార్గాన్ని అనుసరిస్తుండడంతోనే అవార్డును అందుకోగలిగారని అన్నారు. విద్య రంగంతో పాటు, సేవా రంగంలో అందిస్తున్న సేవలను మరింత విస్తృతం చేయాలని వారు ప్రిన్సిపాల్‌కు సూచించారు. అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మిన్నంటిన సంబరాలు



డ్యాన్ చేస్తున్న విద్యార్థులు

కర్నూలు సిటీ: నగర శివారు పంచలింగాల సమీపంలోని మాంటిస్సోరి ఒలంపస్ పాఠశాలలో వింటర్ ఫెస్ట్‌లో భాగంగా మంగళవారం నిర్వహించిన యూఫోరియా (కల్చరల్ నైట్) సంబరాలు మిన్నంటాయి. వేడుకల్లో ఆ స్కూల్ డైరెక్టర్లు కె.ఎస్.వి రవిప్రకాష్, కె.సిద్ధార్థ్, ప్రధానోపాధ్యాయురాలు పి.నాగలక్ష్మీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు, ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడంతో మానసిక ఆరోగ్యంతో పాటు, స్ఫూర్తిదాయక పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. వేడుకల్లో నూతన సంవత్సరానికి స్వాగతం చెబుతూ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు క్లాసికల్, వెస్టర్న్ డ్యాన్సులతో ప్రదర్శనలు ఇచ్చారు. ఉపాధ్యా యులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బైకులు ఢీ..ముగ్గురికి గాయాలు

ఆదోని అర్బన్: పట్టణ శివారు ఆలూరు రోడ్డులోని ఆర్ఆర్ లేబర్ కాలనీ సమీపంలో మంగళవారం రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు తీవ్ర గాయాల పాలయ్యారు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన వీరేష్ అనే విద్యార్థితో పాటు మరో ఇద్దరు విద్యార్థులు బైకుపై ఆదోని వైపుగా వస్తున్నారు. అదే రోడ్డులో అరికెర గ్రామానికి చెందిన రంగన్న మరో బైకుపై ఆలూరు వైపు వెళ్తున్నారు. ఎదురెదురుగా ఈ రెండు బైకులు ఢీకొనడంతో వీరేష్‌తో పాటు మరో విద్యార్థికి, అరికెర రంగన్నకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేసిన వైద్యులు ఒక విద్యార్థిని మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎనిమిది మందిపై హత్య కేసు నమోదు

ఆదోని రూరల్: మండలంలోని చాగి గ్రామంలో కురువ మల్లమ్మ అనే అవివాహితపై దాడి చేసి ఆమె మృతికి కారణమైన 8 మందిపై హత్య కేసు నమోదు చేసినట్లు ఇస్వీ ఎస్ఐ నాగేంద్ర మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈనెల 25వ తేదీన చాగి గ్రామంలో ఇంటి పక్కన డ్రైనేజీ కాలువ విషయంలో గొడవ పడి కురువ మల్లమ్మపై అయ్యప్పరెడ్డి, లక్ష్మితో పాటు మరో ఆరుగురు దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైంది. ఆమె కర్నూలు ఆస్పత్రి చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందింది. సదరు మహిళపై దాడికి పాల్పడిన పై వారిపై హత్య కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.



వేడుకలకు సామగ్రిని తీసుకెళ్తున్న మహిళ



విక్రయానికి ఉంచిన పుష్పగుచ్ఛాలు, పూలమాలలు



పుష్పగుచ్ఛాన్ని పరిశీలిస్తున్న వ్యక్తి


న్యూఇయర్ సందడి

2024 సంవత్సరానికి బైబై చెబుతూ 2025 నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు వివిధ వస్తువుల కొనుగోళ్లతో కర్నూలు నగరం సందడిగా మారింది. మంగళవారం మధ్యాహ్నం నుంచే బేకరీ షాపుల వద్ద కేక్‌లు, స్వీట్ల విక్రయాలు జోరందుకున్నాయి. బేకరీ షాపులు, రెడీమెడ్ దుకాణదారులు తమ దుకాణాలను విద్యుత్ దీపాలతో అలంకరించుకొని కొనుగోలుదారులను ఆకట్టుకొనే ప్రయత్నం చేశారు. షాపుల ముందు ప్రత్యేక స్టాల్‌లు పెట్టి మరీ విక్రయాలు చేపట్టారు. కిలో రూ.200 నుంచి రూ.800 వరకు మామూలు కేక్‌లు, కూల్ కేక్‌లు విక్రయానికి పెట్టగా ప్రజలు పెద్దఎత్తున కొనుగోలు చేశారు. చిన్నారులు, పెద్దలు, యువత బ్యాచ్‌లుగా ఏర్పడి న్యూఇయర్ వేడుకల కోసం కేక్‌లు కొనుగోలు చేశారు. విద్యార్థులు చాక్లెట్లు కొనుగోలు చేశారు. పలువురు ఉద్యోగుల పదవీ విరమణ ఉండగా వారికి వీడ్కోలు పలికేందుకు, అలాగే అభిమాన నేతలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పేందుకు పలువురు పూలదండలు, పుష్పగుచ్ఛాలు కొనుగోలు చేశారు. అలాగే విందు చేసుకొనేందుకు చికెన్ షాపులు, మద్యం దుకాణాల వద్ద క్యూ కట్టారు. గృహిణులు నూతన సంవత్సరానికి స్వాగతం పలికేలా ముగ్గు వేసేందుకు రంగురంగుల ముగ్గుపొడులు కొనుగోలు చేస్తూ కనిపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



కేక్‌లు కొనుగోలు చేస్తున్న ప్రజలు



కేక్‌ను కొనుగోలు చేసి తీసుకెళ్తున్న వ్యక్తి



జోరుగా కేక్‌ల విక్రయాలు



బేకరీలో కేక్‌లను ప్యాకింగ్ చేసి ఉంచిన సిబ్బంది

2న నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పండి

కర్నూలు(సెంట్రల్): భారత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ సంతాప దినాలు డిసెంబర్ 26 నుంచి జనవరి 1వ తేదీ వరకు ఉండడంతో నూతన సంవత్సర వేడు కల శుభాకాంక్షలు తెలిపేందుకు 2వ తేదీన రావాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులకు సూచించారు. ఒకటో తేదీన శుభాకాంక్షలు తెలిపేందుకు రావద్దని ఆయన సూచిస్తూ మంగళవారం ఓ ప్రకటనను విడుదల చేశారు.

డీసీసీబీ సీఈఓగా వెంకటేశ్వరస్వామి

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు ముఖ్య కార్యనిర్వహణ అధికారిగా ఎం.వెంకటేశ్వరస్వామి ఎంపికయ్యారు. ఈయన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో జనరల్ మేనేజర్‌గా పని చేసి ఏడాది క్రితం పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నారు. కర్నూలు డీసీసీబీతో పాటు వివిధ డీసీసీబీల సీఈవో పోస్టులు ఖాళీగా ఉండటంతో కొన్ని నెలల క్రితం ఆప్కాబ్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో భాగంగా వెంకటేశ్వరస్వామి సీఈఓ పోస్టుకు దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఈయన ఎంపికయ్యారు. కొందరు పేర్లను డీసీసీబీ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్ అయిన జేసీ నవ్యకు పంపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ నవ్యతో ఆప్కాబ్ ప్రతినిధి కొండలరావు, ఎఫ్ఏసీతో సీఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న విజయకుమార్ సమావేశమై సీఈవో ఎంపికపై చర్చించారు. ఇందులో ఎం.వెంకటేశ్వరస్వామిని సీఈఓగా ఎంపిక చేస్తూ జేసీ ఉత్తర్వులు జారీ చేశారు. దాదాపు ఏడాది నుంచి ఖాళీగా ఉన్న ఈ పోస్టుకు ఎట్టకేలకు రెగ్యులర్ సీఈవోను ఎంపిక చేశారు.

బొకేలు వద్దు.. మొక్కలే ముద్దు

- నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పేందుకు మొక్కలనే వినియోగించాలి
- గిఫ్ట్‌లు, బహుమానాలకు బదులుగా పెన్నులు, పుస్తకాలు, దుస్తుల వితరణ మేలు
- పర్యావరణానికి ముప్పు ఉన్న నేపథ్యంలో ప్రజల్లో మార్పు రావాలి
- నాలుగైదేళ్ల నుంచి గ్రీట్ విత్ గ్రీన్‌పై స్పష్టమైన మార్పు శుభ సూచకమంటున్న పర్యావరణ వేత్తలు

కర్నూలు(సెంట్రల్): గ్రీట్ విత్ గ్రీన్‌పై ప్రజల్లో స్పష్టమైన మార్పు కనిపించాలని పర్యావరణ వేత్తలు కోరుకుంటున్నారు. బొకేలకు బదులుగా మొక్కలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపితే పర్యావరణానికి మేలు చేసిన వారవుతారు. విచ్చలవిడిగా బొకేలను వినియోగించి పర్యావరణానికి కీడు చేసే బదులుగా మొక్కలు ఇచ్చి శుభాకాంక్షాలు తెలిపితే మంచిదని ప్రజలకు సూచిస్తున్నారు. గత నాలుగైదేళ్ల నుంచి నూతన సంవత్సర వేడుకల్లో అధికారులు, ప్రజాప్రతినిధులకు బొకేలకు బదులుగా మొక్కలు ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతుండడంతో ప్రజల్లో మార్పు కనిపిస్తోంది. ఇదే సంప్రదాయాన్ని నూతన సంవత్సరం 2025లోనూ కొనసాగిస్తే మంచిది.

ఖరీదైన బహుమతులకు బదులుగా...

ఉన్నతాధికారులకు వారి కింది స్థాయి అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులకు వారి అనుచరులు, ఇతర ప్రజలు ఖరీదైన బొకేలు, బహుమతులకు బదులుగా మొక్కలు లేదా విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, స్కూలు బ్యాగులు, పెన్సిళ్లు, పెన్నులను ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పేందుకు ప్రయత్నించాలి. అభిమానం కోసం ఖరీదైన వస్తువులకు బదులుగా పేదలు వినియోగించేందుకు అవసరమైన పుస్తకాలు, దుస్తులను వితరణ చేస్తే ఎంతో మంచిది. ఈ ఒరవడి పర్యావరణానికి ఎంతో మేలు చేస్తుందని పర్యావరణ వేత్తలు అంటున్నారు. పూలబొకేల తయారీకి ఉపయోగించే కవర్, రసాయనాలు, ఇతర పరికరాలు పర్యావరణాన్ని దెబ్బతీస్తాయి. ఒక కవర్ భూమిలో కలసి పోవాలంటే వందల సంవత్సరాలు పడుతుంది. ఆ సమయంలో పంటలు పండక ఆకలి కేకలు వేసే సందర్భాలు వస్తాయి. అదే మొక్కతోపాటు ఇతర వస్తువులను వినియోగించడం ద్వారా ఎరువుగా మారి పంటల ఉత్పాదనకు సహాయ పడుతుంది. పర్యావరణానికి మేలు చేస్తుంది. ఈ క్రమంలో ముందు కూడా బొకే సంస్కృతి పోయి మొక్కలు లేదా పుస్తకాలు ఇచ్చే సంస్కృతిని కొనసాగించేలా ప్రజల్లో చైతన్యం రావాల్సి ఉంది.

ప్రజల్లో మార్పు రావాలి

పర్యావరణానికి కీడుచేసే బొకేలు, ఇతర విలువైన వస్తువులను వినియోగించడంకంటే మేలు చేసే మొక్కల వినియోగమే మంచిదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇందుకు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు కూడా తమకు బొకేలకు బదులుగా మొక్కలు, గిఫ్టులకు బదులుగా పేద విద్యార్థులకు అవసరమైనవి ఇవ్వాలని కోరుతున్నారు. వారి అభిప్రాయం మేరకు అభిమానులు నూతన సంవత్సర వేడుకలతోపాటు ఇతర సందర్భాల్లో మొక్కలనే ఇచ్చి శుభాకాంక్షలు చెబుతున్నారు. దీంతో నాలుగైదేళ్లుగా ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులకు కిందిస్థాయి సిబ్బంది మొక్కలు, పెన్నులు, పుస్తకాలు, పెన్సిళ్లు, కంపాస్‌బాక్సులు అందజేస్తున్నారు. వారు వాటిని లైబ్రరీలకు పంపి పేద విద్యార్థులకు పంపిణీ చేయాలని సూచిస్తుండడం ఎంతో మంచిదని పర్యావరణ వేత్తలు కోరుకుంటున్నారు.



కలెక్టరేట్ ఎదుట విక్రయానికి ఉంచిన మొక్కలు

మొక్కను ఇచ్చి శుభాకాంక్షలు చెప్పడం మంచిది



పూల బొకేకు బదులు మొక్కను ఇచ్చి శుభాకాంక్షలు చెప్పడం పర్యావరణానికి మేలు చేసినట్లు అవుతుంది. బొకే తయారీకి వినియోగించే ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు ఉంటుంది. ఈ విషయం అందరికీ తెలిసిందే. గత కొన్నేళ్లుగా బొకేలకు బదులుగా మొక్కల వినియోగంలో మార్పు వస్తోంది. ఖరీదైన గిఫ్టులకు బదులుగా పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు, దుస్తులు ఇస్తే పేద విద్యార్థులకు ఉపయోగపడతాయి.

– పీవీ కిశోర్‌రెడ్డి, పర్యావరణ పర్యవేక్షక ఇంజినీర్, కర్నూలు

పుస్తకాలు, పెన్నులు తేవాలి



నూతన సంవత్సరం రోజున నాకు శుభాకాంక్షలు చెప్పేందుకు వచ్చే అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఖరీదైన బొకేలకు బదులుగా మొక్కలు ఇచ్చి శుభాకాంక్షలు చెప్పాలని కోరుకుంటా. అది పర్యావరణానికి ఎంతో మేలు చేస్తుంది. ఖరీదైన బహుమతులకు బదులుగా పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, నోట్‌బుక్‌లు ఇస్తే వాటిని పేద విద్యార్థులకు పంపుతా. నాలుగైదేళ్ల నుంచి నాకు పెద్ద ఎత్తున పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు బహుమతిగా వస్తున్నాయి.

– కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, పాణ్యం

కార్మికులకు దుస్తుల పంపిణీ

కర్నూలు (టౌన్): నూతన సంవత్సరం పురస్కరించుకొని నగరపాలక పారిశుధ్య, ఇంజినీరింగ్ విభాగాల రెగ్యులర్ కార్మికులకు మూడు జతల వస్త్రాలు, 2 జతల చెప్పులు, మూడు టవాళ్లు పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక నగరపాలక సంస్థ పరిధిలోని ఎగ్జిబిషన్ మైదానంలోని శానిటేషన్ డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు, స్టాండింగ్ కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ షేక్ యూనుసుబాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి ఏడాది నూతన సంవత్సరం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

మాతాశిశు మరణాలు తగ్గించాలి

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో మాతాశిశు మరణాలు గణనీయంగా తగ్గించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి. శాంతికళ చెప్పారు. మంగళవారం ఆమె తన చాంబర్‌లో జిల్లా ప్రోగ్రామ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు అందించే వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ప్రగతిపై సమీక్షించారు. ప్రసవ సమయంలో గర్భిణి, శిశువు మరణాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యసేవలు, ఇతర కార్యక్రమాల వివరాలు ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. గర్భిణిగా నమోదు చేసుకున్న మహిళలకు తప్పనిసరిగా రక్తహీనత, మూత్ర పరీక్షలతో పాటు థైరాయిడ్, హెచ్ఐవీ, సిఫిలిస్, ఇతర సుఖవ్యాధుల పరీక్షలు చేయాలని తెలిపారు. సమావేశంలో డీ ఎయిడ్స్, లెప్రసి, టీబీ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్, డీఐవో డాక్టర్ నాగప్రసాద్, డీబీసీఎస్ అధికారిణి డాక్టర్ సంధ్య, ఆర్‌బీఎస్‌కే పీవో హేమలత, ఎన్‌టీఆర్ వైద్యసేవ డీసీ డాక్టర్ భాస్కరరెడ్డి, డీఎంవో నూకరాజు, డెమో శ్రీనివాసులుశెట్టి, ఎస్.వో. హేమసుందరం, డీపీవో విజయరాజు, పీడమాలజిస్టు వేణుగోపాల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పి. శాంతికళ

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ పి.రంజిత్‌బాషా హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇసుక అక్రమ రవాణా జరుగకుండా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని పోలీసులు, మైనింగ్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణాను అరికట్టడానికి టాస్క్ ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసి, అవి సమర్థవంతంగా పనిచేసేలా చూడాలన్నారు. కొత్తగా హొళగుంద మండలంలోని ముద్దటమాగి, నందవరం మండలంలోని నాగులదిన్నె, గంగవరం రీచ్‌లకు పర్యావరణ అనుమతులు మంజూరైనట్లు చెప్పారు. నిబంధల ప్రకారం వాటిలో తదుపరి ప్రక్రియను కొనసాగించాలని ఆదేశించారు. ఇసుక రీచ్‌లలో సీసీ కెమెరాలు పూర్తి స్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని గనుల శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో గనుల శాఖ అధికారి రవిచంద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, భూగర్భ శాఖ అధికారి శ్రీనివాసరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు, టౌన్ డీఎస్పీ బాబు ప్రసాదు, డీటీసీ శాంతకుమారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శన

దేవనకొండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని హెచ్ఎం మద్దిలేటి ఆధ్వర్యంలో నిర్వహించారు. కుంకనూరు, కేజీబీవీ, తెర్నెకల్, పి.కోటకొండ, దేవనకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొని పలు వైజ్ఞానిక నమూనా ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శించారు. ఇందులో తెర్నెకల్ జెడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన అబ్సాటెడ్ అవైడింగ్ రోబోట్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. దేవనకొండ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారు చేసిన బయో డీగ్రేడబుల్ ప్లేట్ అండ్ కప్స్ ఆకర్షణగా నిలిచాయి. అలాగే కుంకనూరు జెడ్పీ పాఠశాల నుంచి బేబీ ప్రజెన్స్ డిటెక్టర్ అండ్ వార్నింగ్ సిస్టం ప్రాజెక్టు కూడా ఆకర్షణగా నిలిచింది. వీరు జిల్లా స్థాయిలో వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటారని హెచ్ఎం, ఎంఈఓ–2 తెలిపారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలుగులోకి తీసుకురావడానికి సైన్స్ ఫెయిర్ ఎంతగానో ఉపయోగపడుతుందని వారు చెప్పారు. ఉపాధ్యాయులు శివలక్ష్మి, ఉస్మాన్, వీరేశప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మవ్వ జోడు కుంభోత్సవం





సమ్మతగేరిలో మేటి కుంభోత్సవం జరుగుతున్న దృశ్యం, ప్రత్యేక అలంకరణలో మారెమ్మ దేవి

హొళగుంద: మండల పరిధిలోని సమ్మతగేరి గ్రామంలో వెలసిన మారెమ్మ దేవి జోడు కుంభోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలూరు ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. అదేవిధంగా పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, టీడీపీ ఆలూరు ఇన్‌చార్జ్ వీరభద్రగౌడ్ తదితరులు అమ్మవార్లను దర్శించుకున్నారు. చుట్టు పక్కల పల్లెలతో పాటు ఆంధ్ర – కర్ణాటకకు చెందిన భక్తులు మారెమ్మ దేవిని దర్శించుకోవడానికి తరలివచ్చారు. మంగళవారం తెల్లవారుజామున గ్రామ పురవీధుల గుండా పవిత్ర గంగాజలంతో బయలుదేరిన మేటి కుంభాలు ఆలయానికి చేరకోవడంతో భక్తులు భక్తి పారవశ్యంలో మునిగారు. ఈ సందర్భంగా గంగా పూజానంతరం భక్తులు కుంభాలను వీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయంలో ఉంచారు. అనంతరం దేవికి ఆకుపూజ, మహామంగళారతి, కలశ పూజ, బలిదానం, నైవేద్య సమర్పణ ఇతర ప్రత్యేక పూజలు చేపట్టారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండ హొళగుంద ఎస్ఐ బాల నరసింహులు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

తెగ తాగేశారు!

- మద్యం గోదాములు కిటకిట
- గతేడాదితో పోలిస్తే పెరిగిన అమ్మకాలు
- చివరి మూడు రోజుల్లో దుకాణాలకు రూ.27 కోట్ల సరుకు

కర్నూలు: విశ్వమంతా జరుపుకునే న్యూ ఇయర్ వేడుకల్లో మద్యం ప్రధాన భూమిక పోషించింది. గడిచిన ఏడాదికి వీడ్కోలు, నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రతి ఏటా జిల్లా ప్రజలు అర్ధ రాత్రి వరకు వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీ. ఇందులో భాగంగా స్నేహితులకు గిఫ్టులు, పూలబొకేలు, పండ్లు, స్వీట్ ప్యాకెట్లు ఇవ్వడం కూడా ఆనవాయితీగా వస్తోంది. అయితే కొన్నేళ్లుగా వాటితో పాటు మద్యం కూడా ప్రధానమైనదిగా మారింది. 31వ తేదీ రాత్రి విక్రయాలు గణనీయంగా పెరుగుతాయని భావించిన లిక్కర్ వ్యాపారులు మూడు రోజుల ముందు నుంచే మద్యం దుకాణాలు, బార్లలో అదనంగా స్టాక్ నిల్వ చేసి మద్యం ప్రియులకు తనివి తీరా అందించి సొమ్ము చేసుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 204 మద్యం దుకాణాలు, 48 బార్లు ఉన్నాయి. నూతన సంవత్సర వేడుకలకు మద్యం ప్రియులకు అందించేందుకు గాను ఈ ఏడాది చివరి మూడు రోజుల్లోనే రూ.27 కోట్ల మద్యాన్ని డిపోల నుంచి వ్యాపారులు దుకాణాలకు తరలించారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కట్టడి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మద్యం అమ్మకాలను కట్టడి చేయగా కూటమి సర్కార్ వచ్చాక విచ్చలవిడిగా అందుబాటులోకి తెచ్చింది. ప్రతి పది వేల మంది జనాభాకు ఓ మద్యం దుకాణం ఏర్పాటు చేసింది. అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతో ఊరూరా బెల్టు దుకాణాలు వెలిశాయి. దీంతో నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని వ్యాపారులు మద్యాన్ని ఊరూవాడా ఏరులై పారించారు. గత ప్రభుత్వ హయాంలో డిసెంబర్ నెలలో ఉమ్మడి జిల్లాలో రూ.133 కోట్ల విక్రయాలు జరగ్గా, ఈ ఏడాది రూ.163 కోట్లు (మద్యం, బీర్లు కలిపి) మద్యం గోదాముల్లో విక్రయాలు జరిగాయి.



గోదాములు కిటకిట

ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండు మద్యం గోడౌన్లు ఉన్నాయి. రెండు గోదాముల్లోనూ ఈ ఏడాది చివరి మూడు రోజులు రాత్రి పొద్దుపోయే వరకు అమ్మకాలు కొనసాగాయి. ఇందులో కర్నూలు డిపోలో రూ.15 కోట్లు, నంద్యాల డిపోలో రూ.12 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. గత ఏడాది చివరి మూడు రోజుల్లో రూ.18 కోట్లు విక్రయాలు జరగ్గా ఈ ఏడాది అమ్మకాలు అమాంతంగా పెరిగాయి. కేవలం మూడు రోజుల్లోనే రూ.27 కోట్ల అమ్మకాలు చోటు చేసుకున్నాయి.

ఇన్‌వాయిస్ ధరపై...

డిపోల నుంచి వ్యాపారులకు ఇన్‌వాయిస్ ధరపై మద్యం అందిస్తుండగా వాటికి తమ లాభ శాతం జోడించి ఎంఆర్‌పీ ధరకు విక్రయించాల్సి ఉంది. చివరి మూడు రోజుల్లో రూ.27 కోట్ల విలువ చేసే మద్యాన్ని వ్యాపారులు డిపోల నుంచి ఇన్‌వాయిస్ ధరలపై కొనుగోలు చేసి బెల్టు షాపుల ద్వారా రెట్టింపు ధరలకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. నూతన సంవత్సర వేడుకలు ముందురోజు సాయంత్రం నుంచే ప్రారంభం కావడంతో కొందరు అర్ధ రాత్రి వరకు మద్యం తాగి హంగామా సృష్టించారు. జిల్లాలోని ప్రధాన ప్రాంతాల్లో పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. మోతాదుకు మించి మద్యం తాగి కొంతమంది యువకులు పోలీసులకు పట్టుబడ్డారు. జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదని పోలీసులు హెచ్చరించగా సంవత్సరంలో మొదటి రోజే జైలుకెళ్లడం బాధగా ఉందంటూ కర్నూలులో కొంతమంది మందుబాబులు పోలీసులను వేడుకోవడం కనిపించింది.

వరుణ్ వీరోచిత సెంచరీ

82 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్స్‌లతో 109 నాటౌట్

- తిలక్ వర్మ 99 అవుట్
- కర్ణాటకపై హైదరాబాద్ గెలుపు
- మయాంక్ అగర్వాల్ శతకం వృథా


వరుణ్

అహ్మదాబాద్: భారీ లక్ష్యం ముందున్నా... ఆందోళన చెందకుండా సంయమనంతో ఆడిన హైదరాబాద్ జట్టు విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నీలో కర్ణాటక జట్టుపై మూడు వికెట్ల తేడాతో అద్భుత విజయం అందుకుంది. చివరి ఓవర్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన పోరులో హైదరాబాద్ రెండు బంతులు మిగిలి ఉండగా లక్ష్యాన్ని ఛేదించింది. వరుణ్ గౌడ్ (82 బంతుల్లో 109 నాటౌట్; 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) అజేయ శతకంతో హైదరాబాద్ జట్టును గెలిపించాడు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న కర్ణాటక జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 320 పరుగులు చేసింది. కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (112 బంతుల్లో 124; 15 ఫోర్లు, 2 సిక్స్‌లు) మరో సెంచరీతో చెలరేగగా... స్మరణ్ (75 బంతుల్లో 83; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. హైదరాబాద్ బౌలర్లలో చామా మిలింద్ 3 వికెట్లు పడగొట్టగా... అనికేత్ రెడ్డి 2 వికెట్లు తీశాడు. ముదస్సిర్, రోహిత్ రాయుడులకు ఒక్కో వికెట్ లభించింది. లక్ష్యఛేదనలో హైదరాబాద్ 49.4 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 322 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ తిలక్ వర్మ (106 బంతుల్లో 99; 7 ఫోర్లు, 1 సిక్స్) పరుగు తేడాతో శతకం చేజార్చుకోగా... వరుణ్ గౌడ్ వీరవిహారం చేశాడు. తిలక్, వరుణ్ ఐదో వికెట్‌కు 112 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కబెట్టారు. కీలక సమయంలో తిలక్ వెనుదిరిగినా... చివరి వరకు క్రీజులో నిలిచిన వరుణ్ గౌడ్ భారీ షాట్లతో విరుచుకుపడి జట్టును గెలిపించాడు. తనయ్ త్యాగరాజన్ (17 బంతుల్లో 25; 3 ఫోర్లు, 1 సిక్స్), వరుణ్ ఏడో వికెట్‌కు 71 పరుగులు జోడించారు. చివరి ఓవర్ తొలి బంతికి తనయ్ అవుటైనా... చామా మిలింద్ (4 నాటౌట్)తో కలిసి వరుణ్ హైదరాబాద్‌ను విజయతీరాలకు చేర్చాడు. కర్ణాటక బౌలర్లలో ప్రవీణ్ దూబే, నికిన్ జోస్ చెరో రెండు వికెట్లు తీశారు. వరుణ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. తమ తదుపరి మ్యాచ్‌లో శుక్రవారం పంజాబ్‌తో హైదరాబాద్ ఆడుతుంది.

పశ్చిమ బెంగాల్ 33వసారి...

- సంతోష్ ట్రోఫీ టైటిల్ సొంతం
- ఫైనల్లో కేరళపై విజయం

సాక్షి, హైదరాబాద్: జాతీయ సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ సంతోష్ ట్రోఫీలో 33వసారి పశ్చిమ బెంగాల్ జట్టు చాంపియన్‌గా అవతరించింది. మంగళవారం జీఎంసీ బాలయోగి స్టేడియంలో హోరాహోరీగా సాగిన తుదిపోరులో పశ్చిమ బెంగాల్ జట్టు 1–0 గోల్ తేడాతో కేరళ జట్టుపై విజయం సాధించింది. పశ్చిమ బెంగాల్ తరఫున రాబీ హన్స్‌దా (90+4వ నిమిషంలో) ఏకైక గోల్ చేసి జట్టుకు టైటిల్ అందించాడు. ఆదిత్య థాపా కొట్టిన హెడర్‌ను బాక్స్‌కు సమీపంలో అందుకున్న రాబీ... సునాయాసంగా ప్రత్యర్థి పోస్ట్‌లోకి పంపాడు. ఆ తర్వాత స్కోరు సమం చేసేందుకు కేరళ జట్టు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. గ్రూప్ దశలో అత్యుత్తమ ప్రదర్శనతో పరాజయం ఎరగకుండా ఫైనల్‌కు చేరిన ఇరుజట్ల మధ్య ఉత్కంఠ భరిత సమరం జరగగా... చివరకు పశ్చిమ బెంగాల్‌నే విజయం వరించింది.

వారెవ్వా వైశాలి



మహిళల విభాగంలో అగ్ర స్థానంతో నాకౌట్‌కు అర్హత

- హంపి చేజారిన అవకాశం
- వరల్డ్ చెస్ 'బ్లిట్జ్' చాంపియన్‌షిప్

న్యూయార్క్: భారత గ్రాండ్‌మాస్టర్ వైశాలి రమేశ్ బాబు 'ఫిడే' వరల్డ్ బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్‌లో క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. టోర్నీ తొలి రోజు మంగళవారం జరిగిన క్వాలిఫయింగ్ దశలో 11 గేమ్‌లలో కలిపి ఆమె మొత్తం 9.5 పాయింట్లతో అగ్ర స్థానంలో నిలిచింది. 8 గేమ్‌లు గెలిచిన వైశాలి 3 గేమ్‌లను 'డ్రా' చేసుకుంది. తొలి నాలుగు గేమ్‌లను వరుసగా గెలుచుకొని 23 ఏళ్ల వైశాలి శుభారంభం చేసింది. ఐదో గేమ్‌లో ఆమెకు రష్యాకు చెందిన మాజీ బ్లిట్జ్ వరల్డ్ చాంపియన్ కేటరీనా లాగ్నోతో గట్టి పోటీ ఎదురైంది. హోరాహోరీ సమరం తర్వాత ఈ గేమ్ 'డ్రా'గా ముగిసింది. ఆ తర్వాత వైశాలి వరుసగా ఆరు, ఏడు, ఎనిమిదో గేమ్‌లలో విజయాలు సొంతం చేసుకుంది. ఎనిమిదో రౌండ్‌లో ప్రస్తుత వరల్డ్ బ్లిట్జ్ చాంపియన్ వలెంటినా గునీనా (రష్యా)పై గెలవడం ఆమె ముందంజ వేయడంలో కీలకంగా మారింది. 9వ రౌండ్‌ను 'డ్రా'గా ముగించుకున్న అనంతరం పదో గేమ్‌లో పొలినా షువలోవా (రష్యా)ను ఓడించడంతో వైశాలికి అగ్ర స్థానం ఖాయమైంది. దాంతో అమెరికాకు చెందిన కారిసా ఇప్‌తో జరిగిన 11వ గేమ్‌ను చకచకా 9 ఎత్తుల్లోనే 'డ్రా' చేసుకొని వైశాలి క్వాలిఫయింగ్ దశలో నంబర్‌వన్‌గా నిలిచింది. మొత్తం 8 మంది ప్లేయర్లు క్వార్టర్ ఫైనల్ (నాకౌట్) దశకు అర్హత సాధించారు. క్వార్టర్ ఫైనల్లో జు జినర్ (చైనా)తో వైశాలి తలపడుతుంది. మరోవైపు వరల్డ్ ర్యాపిడ్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ కోనేరు హంపి నాకౌట్‌కు చేరలేకపోయింది. 11 రౌండ్‌ల తర్వాత మొత్తం 8 పాయింట్లతో ఆమె 9వ స్థానంతో ముగించింది. 8 గేమ్‌లను గెలిచిన హంపి...మరో 3 గేమ్‌లలో పరాజయం పాలైంది. ఎనిమిదో రౌండ్‌లో మరో భారత ప్లేయర్ దివ్య దేశ్‌ముఖ్ చేతిలో అనూహ్యంగా ఓడటం హంపి అవకాశాలను దెబ్బ తీసింది. ఇతర భారత క్రీడాకారిణులు దివ్య దేశ్‌ముఖ్ (7 పాయింట్లు) 18వ ర్యాంక్‌లో, వంతిక అగర్వాల్ (7 పాయింట్లు) 19వ ర్యాంక్‌లో, ద్రోణవల్లి హారిక (7 పాయింట్లు) 22వ ర్యాంక్‌లో, నూతక్కి ప్రియాంక (5 పాయింట్లు) 70వ ర్యాంక్‌లో, పద్మిని రౌత్ (5 పాయింట్లు) 71వ ర్యాంక్‌లో, సాహితి వర్షిణి (4.5 పాయింట్లు) 76వ ర్యాంక్‌లో నిలిచారు. పాయింట్లు సమంగా ఉన్నపుడు మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరిస్తారు.

అర్జున్‌కు నిరాశ...

పురుషుల (ఓపెన్) విభాగంలో భారత ఆటగాళ్లలో ఎవరూ క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయారు. మొత్తం 13 రౌండ్‌ల తర్వాత భారత్ నుంచి అత్యుత్తమంగా ఆర్.ప్రజ్ఞానంద 8.5 పాయింట్లతో 23వ స్థానంతో ముగించగా, రౌనక్ సాధ్వానికి 35వ స్థానం (8 పాయింట్లు) దక్కింది. తెలంగాణకు చెందిన అర్జున్ ఇరిగేశి 7 పాయింట్లు మాత్రమే సాధించి 64వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. తొలి 5 గేమ్‌లలో గెలిచి అగ్రస్థానంతో ముందుకు దూసుకుపోయిన అర్జున్‌కు ఆ తర్వాత అనూహ్య ఫలితాలు ఎదురయ్యాయి. తర్వాతి 5 రౌండ్‌లలో 2 ఓడి, 2 'డ్రా' చేసుకున్న అతను ఒకటే గేమ్ గెలవగలిగాడు. ఆఖరి 3 రౌండ్‌లలో వరుసగా అనీశ్ గిరి (నెదర్లాండ్స్), డెనిస్ లజావిక్ (రష్యా), కజీబెక్ నొగర్‌బెక్ (కజకిస్తాన్)ల చేతుల్లో ఓడటంతో రేసులో అర్జున్ పూర్తిగా వెనుకబడిపోయాడు.

శ్రీకర్ భరత్, అశ్విన్ అజేయ సెంచరీలు

- మేఘాలయపై 10 వికెట్లతో ఆంధ్ర ఘనవిజయం
- 5 వికెట్లు పడగొట్టిన సందీప్
- విజయ్ హజారే ట్రోఫీ టోర్నీ


సందీప్


అశ్విన్ శ్రీకర్ భరత్

ముంబై: దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో ఆంధ్ర జట్టు జోరు కొనసాగుతోంది. గ్రూప్ 'బి'లో భాగంగా ఆంధ్ర జట్టు నాలుగో విజయం ఖాతాలో వేసుకుంది. మంగళవారం జరిగిన పోరులో ఆంధ్ర 10 వికెట్ల తేడాతో మేఘాలయను మట్టికరిపించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన మేఘాలయ జట్టు 48.2 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ నిశాంత చక్రవర్తి (108 బంతుల్లో 101; 13 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగగా... అర్పిత్ (90 బంతుల్లో 66; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకంతో రాణించాడు. దీంతో ఒకదశలో మేఘాలయ జట్టు 182/1తో పటిష్ట స్థితిలో కనిపించింది. అయితే ఆ తర్వాత ఆంధ్ర బౌలర్లు విజృంభించి వరుస విరామాల్లో వికెట్లు పడగొట్టారు. దీంతో మేఘాలయ బ్యాటర్లు ఒకరి వెంట ఒకరు పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఆంధ్ర బౌలర్లలో యారా సందీప్ 28 పరుగులిచ్చి 5 వికెట్లతో అదరగొట్టగా... ఆంజనేయులు, మహీప్ కుమార్ రెండేసి వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనలో ఆంధ్ర 29.3 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 228 పరుగులు చేసింది. ఆంధ్ర కెప్టెన్ శ్రీకర్ భరత్ (81 బంతుల్లో 107 నాటౌట్; 9 ఫోర్లు, 7 సిక్స్‌లు) సెంచరీతో విజృంభించాడు. మరో ఓపెనర్ అశ్విన్ హెబర్ (96 బంతుల్లో 108 నాటౌట్; 13 ఫోర్లు, 1 సిక్స్) కూడా 'శత'క్కొట్టడంతో ఆంధ్ర జట్టు ఆడుతూ పాడుతూ లక్ష్యాన్ని ఛేదించింది. మేఘాలయ బౌలింగ్‌ను ఓ ఆటాడుకున్న భరత్... సిక్స్‌లతో చెలరేగిపోతే అశ్విన్ బౌండరీలతో హోరెత్తించాడు. వీరిద్దరూ పోటీపడి పరుగులు రాబట్టడంతో లక్ష్యం చిన్నబోయింది. గత మ్యాచ్‌లో సర్వీసెస్‌పై అజేయ అర్ధశతకాలతో వికెట్ నష్టపోకుండానే జట్టును గెలిపించిన భరత్, అశ్విన్... ఈసారి కూడా దాన్ని పునరావృతం చేశారు. 5 వికెట్లు తీసిన సందీప్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. గ్రూప్‌లో ఇప్పటి వరకు 5 మ్యాచ్‌లాడిన ఆంధ్ర జట్టు 4 విజయాలు, ఒక పరాజయంతో 16 పాయింట్లు ఖాతాలో వేసుకొని రెండో స్థానంలో కొనసాగుతోంది. తదుపరి మ్యాచ్‌లో శుక్రవారం మహారాష్ట్రతో ఆంధ్ర జట్టు తలపడుతుంది.

2025 స్పోర్ట్స్ క్యాలెండర్
మరిన్ని క్రీడా వార్తలు | సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా


• ఎన్టీఆర్ • ప్రభాస్ • మహేశ్ బాబు

విదేశాల్లో 2025

2024కి బై చెప్పి... 2025కి వెల్‌కమ్ చెప్పడానికి అందరూ సెలబ్రేషన్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. కొందరు స్టార్స్ అయితే కొత్త సంవత్సరం జరుపుకోవడానికి విదేశాలు వెళ్లారు. షూటింగ్స్‌కి కాస్త విరామం దొరకడంతో వెకేషన్ ప్లాన్ చేసుకునే అవకాశం ఈ స్టార్స్‌కి దక్కింది. వారి ఈ వెకేషన్ గురించి తెలుసుకుందాం...

చిత్రీకరణలు ఓ కొలిక్కి వచ్చిన తర్వాత 'అర్జున్ రెడ్డి' ఫేమ్ సందీప్ రెడ్డి వంగాతో 'స్పిరిట్' చిత్రాన్ని ఆరంభిస్తారు ప్రభాస్. ఇక 'దేవర' సక్సెస్ జోష్‌లో ఉన్నారు ఎన్టీఆర్. ప్రస్తుతం ఎన్టీఆర్ హిందీలో స్ట్రయిట్ ఫిల్మ్ 'వార్ 2' (ఈ చిత్రంలో హృతిక్ రోషన్ మరో హీరో) లో నటిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమాకు చెందిన ఓ లెంగ్తీ షూట్‌ను పూర్తి చేశారు. ఆ తర్వాత ఫ్యామిలీతో కలిసి లండన్ వెళ్లారని తెలిసింది. సో... ఎన్టీఆర్ న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ లండన్‌లోనే అని ఊహించవచ్చు. లండన్ నుంచి తిరిగొచ్చిన తర్వాత ప్రశాంత్ నీల్ దర్శకత్వంలోని 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్) షూటింగ్‌తో ఎన్టీఆర్ బిజీ అవుతారట. ఇంకా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ కోసం హీరోయిన్ పూజా హెగ్డే స్పెయిన్ వెళ్లారు. రష్మికా మందన్నా ఆల్రెడీ ఫారిన్‌లోనే ఉన్నారని తెలిసింది. హీరోయిన్ తమన్నా, ఫరియా అబ్దుల్లా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌ను అమెరికాలో ప్లాన్ చేశారని తెలిసింది. వీరితో పాటు మరి కొందరు టాలీవుడ్ యాక్టర్స్ గోవా, మాల్దీవ్స్‌లో వేడుకలు ప్లాన్ చేశారని సమాచారం.


• కుటుంబ సభ్యులతో ఎన్టీఆర్

ఈ ఏడాది మహేశ్‌బాబు ఇప్పటికే రెండుసార్లు జర్మనీ వెళ్లొచ్చారు. అయితే ఇది హాలిడే ట్రిప్ కాదు. రాజమౌళి దర్శకత్వంలో రూపొందనున్న సినిమా ప్రిపరేషన్‌లో భాగంగా జర్మనీ వెళ్లారని చెప్పుకోవచ్చు. అయితే ప్రతి ఏడాది మహేశ్‌బాబు న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ ఫారిన్‌లో జరుగుతుంటాయి. ఈ ఏడాది కూడా ఫారిన్‌లోనే మహేశ్‌బాబు ప్లాన్ చేశారని సమాచారం. మహేశ్‌బాబు మోస్ట్‌లీ యూరప్‌కు వెళ్లనున్నారట.

ఇక ప్రభాస్ ఆల్రెడీ యూరప్‌లో ఉన్నారని తెలిసింది. ఇటీవల ఓ సినిమా చిత్రీకరణలో భాగంగా ప్రభాస్ కాలికి గాయమైంది. వైద్యుల సూచనల మేరకు ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. యూరప్‌లోనే విశ్రాంతి తీసుకుంటున్నారని, ప్రభాస్ న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ అక్కడే అని టాక్. విదేశాల నుంచి తిరిగొచ్చిన తర్వాత 'రాజా సాబ్, ఫౌజీ' చిత్రీకరణలో పాల్గొంటారు ప్రభాస్. ఈ సినిమాల


• సరిత, నయనతార, విఘ్నేశ్, మాధవన్

భర్త విఘ్నేష్ శివన్‌తో నయనతార దుబాయ్ వెళ్లారు. అక్కడే మాధవన్, ఆయన భార్య సరిత కూడా ఉన్నారు. సో... ఈ రెండు ఫ్యామిలీస్ ఒకే చోట వేడుక చేసుకోనున్నారు. కలిసి ఉన్న ఫొటోను కూడా షేర్ చేశారు. అలాగే బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ కూడా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ స్పాట్‌గా దుబాయ్‌నే ఎంచుకున్నారు. ఇంకా ఫ్యామిలీతో కలిసి దియా మీర్జా శ్రీలంక వెళ్లారు. అర్జున్ రాంపాల్ సెలబ్రేషన్స్ గోవాలో జరుతాయని సమాచారం. ఫ్యామిలీతో కలిసి కరీనా కపూర్ స్విట్జర్లాండ్‌లో, శిల్పాశెట్టి లండన్‌లో, భర్త జహీర్ ఇక్బాల్‌తో కలిసి హీరోయిన్ సోనాక్షీ సిన్హా ఆస్ట్రేలియాలో న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ జరుపుకోనున్నారు. 'యానిమల్' ఫేమ్ త్రిప్తీ దిమ్రీ ఫిన్‌ల్యాండ్ వెళ్లారు.

ఓ వెన్నెల...

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ప్రముఖ దర్శకుడు శంకర్ కుమార్తె అదితీ శంకర్ హీరోయిన్. ఈ చిత్రానికి శ్రీ చరణ్ పాకాల సంగీతం అందించారు. ఈ నెల 3న బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా 'భైరవం' మూవీ నుంచి 'ఓ వెన్నెల..' అంటూ సాగే పాటని రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించి, కొత్త పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ''యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న చిత్రం 'భైరవం'. ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదల చేసిన సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ ఫస్ట్ లుక్ పోస్టర్స్ మంచి బజ్‌ను క్రియేట్ చేశాయి'' అని చిత్రబృందం పేర్కొంది.


• సాయి శ్రీనివాస్, అదితీ శంకర్

2024ని మంచి సినిమాతో ముగించాను


- జాన్వీ కపూర్



''అమరన్' సినిమాని కాస్త ఆలస్యంగా చూశాను. అయితే 2024 సంవత్సరాన్ని ఇలాంటి ఒక అద్భుతమైన, ఒక మంచి సినిమా చూసి ముగించినందుకు చాలా సంతోషంగా ఉంది'' అని హీరోయిన్ జాన్వీ కపూర్ అన్నారు. శివ కార్తికేయన్, సాయిపల్లవి జోడీగా నటించిన ద్విభాషా చిత్రం (తమిళ్, తెలుగు) 'అమరన్'. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహించారు. 2014లో జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో అసువులు బాసిన మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవిత కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. దీపావళి కానుకగా 2024 అక్టోబరు 31న విడుదలైంది. ఈ మూవీ తెలుగు, తమిళ భాషల్లో ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. అంతేకాదు.. ఈ చిత్రంపై ఇప్పటికే ఎంతోమంది స్టార్స్ కూడా ప్రశంసలు కురిపించారు. తాజాగా జాన్వీ కపూర్ కూడా 'అమరన్' మూవీపై తన ఇన్‌స్టాగామ్ ద్వారా ప్రశంసలు కురిపించారు. ''అమరన్' సినిమాని నేను చూడడం ఆలస్యమైంది. కానీ, ఎంతో అద్భుతమైన సినిమా. ప్రతి సన్నివేశం చాలా భావోద్వేగంతో నిండిపోయింది. ఈ ఏడాదికి 'అమరన్' బెస్ట్ మూవీ. ఈ చిత్రం నా హృదయాన్ని కదిలించింది. ఈ సినిమాలోని సన్నివేశాలు నా హృదయాన్ని బరువెక్కించాయి. ఓ ప్రేక్షకురాలిగా 2024ని ఇలాంటి ఒక మంచి సినిమాతో ముగించడం సంతోషంగా ఉంది'' అని పోస్ట్ చేశారామె. కాగా ఎన్టీఆర్ 'దేవర' మూవీతో టాలీవుడ్‌కి ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ ప్రస్తుతం రామ్‌చరణ్‌కి జోడీగా నటిస్తున్నారు.

గుండె జారిపోయిందే!

వరుణ్ రాజ్ హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'పోకిరి'. వికాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మమత హీరోయిన్. ప్రమోద్ రాజు సమర్పణలో రాజా మూవీస్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. కాగా వరుణ్ రాజ్ పుట్టినరోజు సందర్భంగా 'పోకిరి' నుంచి 'గుండె జారిపోయిందే..'. అంటూ సాగే మొదటి పాటని మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో–నిర్మాత వరుణ్ రాజ్ మాట్లాడుతూ– ''పోకిరి' టైటిల్‌లోనే దమ్ముంది. ఈ సినిమాతో హిట్ సాధిస్తామనే నమ్మకం ఉంది. 'పోకిరి' సినిమాకి ఓనర్ మహేశ్‌బాబుగారే. మేమంతా ఆయన అభిమానులం అంతే'' అన్నారు. ''ఈ మూవీ స్టోరీ లైన్ రాసుకున్నప్పటి నుంచి 'పోకిరి' అనే టైటిల్ అనుకున్నాం'' అని వికాస్ చెప్పారు. ''పోకిరి' నా తొలి సినిమా'' అని పేర్కొన్నారు మమత. సంగీత దర్శకుడు ఉదయ్ కిరణ్ మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: వెంకీ–వంశీ.


• వరుణ్ రాజ్, మమత

ఓటీటీ ఇది చూడొచ్చు

సీక్రెట్స్ ఆఫ్ ఆర్ఆర్ఆర్ బై రాజమౌళి

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో ఆర్ఆర్ఆర్ - బిహైండ్ అండ్ బియాండ్ ఒకటి. ఈ డాక్యుమెంటరీ గురించి తెలుసుకుందాం.



తన ఉనికిని తెలిపేందుకు ఓ గదిలో నలుగురు ముందు చప్పట్లు కొడితే ఆ నలుగురికి తన విషయం తెలియవచ్చు. కానీ అదే ఉనికి ప్రపంచానికి తెలియాలంటే సరిగ్గా రాజమౌళిలా ఆలోచించాలి. భారత దేశానికి ఒకప్పుడు సినిమా ప్రమోషన్‌ను ఓ వినూత్న పంథాలో పరిచయం చేసిన బాలీవుడ్ దిగ్గజం అమిర్ ఖాన్ కూడా తాను ఈ విషయంలో రాజమౌళినే ఫాలో అవుతాననడం దీనికి ఓ నిదర్శనం. చరిత్ర అనేది రాజమౌళి ముందు ఉన్నది తరువాత ఉంటుంది. కానీ ఆ చరిత్రలో రాజమౌళికి ఓ చెరగని పేజీ ఉంటుందనేది మాత్రం నిర్వివాదాంశం. తెలుగు సినిమా వైభవాన్ని ఎన్నో అంతర్జాతీయ వేదికలపైన నిలిపిన శిల్పి రాజమౌళి. మరీ ముఖ్యంగా తెలుగు సినిమాకి ఆస్కారమే లేదన్న ఆస్కార్ పురస్కారాన్ని అద్భుతంగా అందించిన అత్యున్నత దర్శకులు రాజమౌళి. తన సినిమా అంటేనే ఓ సంచలనం. మరి... ఆ సంచలనం వెనకున్న సీక్రెట్ తెలుసుకోవాలని ప్రతి దర్శకుడితో పాటు సామాన్య ప్రేక్షకుడికి కూడా ఆసక్తి ఉంటుంది. ఆ కోవలోనే రాజమౌళి తీసిన 'ఆర్ఆర్ఆర్' సినిమాకి సంబంధించిన తన కష్టాన్ని ఓ చక్కటి డాక్యుమెంటరీ రూపంలో 'ఆర్ఆర్ఆర్ – బిహైండ్ అండ్ బియాండ్' పేరిట నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులో ఉంచారు. దాదాపు రెండున్నర గంటల పై నిడివి ఉన్న 'ఆర్ఆర్ఆర్' సినిమాను నాలుగేళ్ల పాటు తీశారు. ఈ డాక్యుమెంటరీలో ఆ సినిమా మొత్తాన్ని ఎలా తీశారో రాజమౌళి వ్యాఖ్యానంతో పాటు సినిమాలోని నటీనటులు టెక్నీషియన్స్ కూడా వివరిస్తూ చూపించడం ఎంతో బాగుంది. తన ఈ 'ఆర్ఆర్ఆర్' ప్రయాణానికి సంబంధించి ఎన్నో తెలియని, చూడని అద్భుత విషయాలను ప్రేక్షకులకు అందంగా అందించారు. ఇక్కడ ఇంకో విషయం చెప్పుకోవాలి... ఈ డాక్యుమెంటరీకి సంబంధించిన ఫుటేజ్ కొన్ని గంటల రూపంలో ఉంటే దానిని ఎడిట్ చేసి, గంటన్నర నిడివితో అందించారట. ఈ సమాజమనేది ఓ సృష్టి. ప్రతిరోజూ మన మనుగడ ఈ సృష్టికి అనుగుణంగానే ఉంటుంది. ఓ రకంగా సినిమా అన్నది కూడా ఓ సృష్టే. ఓ దర్శకుడి ఆలోచనకు ప్రతిరూపమే సినిమా అన్న ఓ అద్భుత సృష్టి. కానీ ఈ సినిమా సృష్టిలో ఎంతోమంది కష్టం ఉంటుంది. మరి... అటువంటి సినిమాను ఏ విధంగా రూపొందించారో ఆ రహస్యాలు మీరు కూడా తెలుసుకోవాలంటే నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతున్న 'ఆర్ఆర్ఆర్ – బిహైండ్ అండ్ బియాండ్'ని చూసేయండి. వర్త్ టు వాచ్ అండ్ ప్రిజర్వ్ ద డాక్యుమెంటరీ ఫర్ ది ఫ్యూచర్ కిడ్స్.

– ఇంటూరు హరికృష్ణ

ఈ మూవీ రివ్యూ వీడియో రూపంలో చూడాలంటే ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

కూటమి వైఫల్యాలపై ప్రజా ఉద్యమం

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజా ఉద్యమాలకు శ్రీకారం చుడతామని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ పిలుపునిచ్చారు. మంగళవారం సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 29, 30 తేదీల్లో ఎమ్మిగనూరులో నిర్వహించిన సీపీఎం జిల్లా మహాసభల్లో 26 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు చెప్పారు. అంతేకాక జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలని తీర్మానించినట్లు చెప్పారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిని ఎయిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలని, రాయలసీమ, క్లస్టర్, ఉర్దూ యూనివర్సిటీ అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని, ఓర్వకల్‌లో కనీసం 10 వేల మందికి ఉపాధి లభించేలా పరిశ్రమలను ఏర్పాటు చేయాలని, జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను నిర్మించాలని తీర్మానాలు చేశామని, వాటిని సాధించడం కోసం ప్రజల భాగస్వామ్యాలతో పోరాటాలకు శ్రీకారం చుడతామని చెప్పారు. నాయకులు జి.రామకృష్ణ, పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు, టి.రాముడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డి.గౌస్‌దేశాయ్

ఏఐవైఎఫ్ నూతన జిల్లా కమిటీ ఎన్నిక

కర్నూలు(సెంట్రల్): ఇటీవల కర్నూలులో జరిగిన ఏఐవైఎఫ్ 16వ జిల్లా మహాసభల్లో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి లింగంబాబు ప్రకటించారు. మొత్తం 41 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు చెప్పారు. అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీరాములుగౌడ్, కె.శ్రీనివాసులు ఎన్నికైనట్లు చెప్పారు.

పెరిగిన రూ.10 నాణెం వినియోగం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో 10 రూపాయల నాణేలు పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చాయని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామచంద్రరావు తెలిపారు. కొన్నేళ్లపాటు చెలామణిలోనే లేకుండా పోయిన నాణేలను మళ్లీ వినియోగంలోకి తీసుకురావడం బ్యాంకింగ్ రంగంలో అతి పెద్ద విజయమని పేర్కొన్నారు. నాణేలను చెలామణిలోకి తేవడంతో ఆర్‌బీఐ, లీడ్ బ్యాంకు, ఇతర అన్ని బ్యాంకుల కృషి ఎంతో ఉందన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మూడు, నాలుగు నెలల క్రితం వరకు 10 రూపాయల నాణేలు ఎక్కడా కనిపించేవి కావని, బ్యాంకుల్లో ఈ నాణేలు పేరుకుపోయి ఉండేవన్నారు. జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, బ్యాంకర్లు సమిష్టిగా పనిచేయడం వల్ల నాణేలు పూర్తి స్థాయిలో చెలామణిలోకి వచ్చాయని చెప్పారు. ఎలాంటి అనుమానం లేకుండా రూ.10 నాణేలను క్రయవిక్రయాలకు వినియోగించవచ్చని ఆయన సూచించారు. మార్కెట్లో రూ.10 నోట్లు తగ్గిపోవడంతో చిల్లర సమస్య ఏర్పడిందని, నాణేలతో ఈ సమస్య కొంత తీరుతుందన్నారు. నాణేల వినియోగాన్ని మరింత పెంచాలని బ్యాంకులు, వ్యాపారులు, వినియోగదారులను కోరారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

కర్నూలు(రూరల్): జిల్లా కేంద్రం కర్నూలు సమీపాన వెలసిన వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూకట్టారు. ఎల్లమ్మకు అభిషేకం, కుంకుమా అర్చన తదితర పూజలు నిర్వహించారు. చీరెలు, వడి బియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.


ప్రత్యేక అలంకారణలో అమ్మవారు

డిగ్రీ ఫలితాలు విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో మే/జూన్ నెలల్లో జరిగిన డిగ్రీ 2, 4వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ ఆదేశాల మేరకు ఫలితాలను విడుదల చేసినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. రెండో సెమిస్టర్ పరీక్షలకు 6,376 మంది హాజరు కాగా 2,752 మంది, నాల్గవ సెమిస్టర్‌కు 5,735 మందికి 3,133 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. ఫలితాలు https://rayalaseemauniversity.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రీవాల్యుయేషన్ చేయంచాలనుకునే వారు ఈనెల 10వ తేదీలోగా సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్ల వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

4న లూయిస్ బ్రెయిలీ జయంతి

కర్నూలు(అర్బన్): ఈ నెల 4వ తేది ఉదయం 11 గంటలకు నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో లూయిస్ బ్రెయిలీ 217వ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఉమ్మడి జిల్లా సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జయంతి రోజున ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, బ్యాంకు ఉద్యోగులైన అంధులకు ఓడీ సౌకర్యం కల్పించామన్నారు. ఈ నేపథ్యంలోనే అంధ ఉద్యోగులు తమ అధికారులకు తెలియజేసి ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆమె కోరారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడము ఏమనగా P. Lakshmi Devi W/o P.Raghu Ram Reddy M/s. Creative Educational Society Member అయిన నేను తెలుపుట ఏమనగా (1) V.Bhaskar Reddy, (2) S.Ramesh Reddy, (3) S.Narayana Reddy, (4) K. Krishna Reddy (5) Y.Kesava Reddy అను వీరు. కొంత మంది original society Members యొక్క సంతకాలు ఫోర్జరీ చేసి వారి పేర్లను తొలగించి society లో సభ్యులుగా చేరినారు. వీరు society ని అమ్మాలని ప్రయత్నిస్తున్నారు. కావున ఎవరైన కొనిన గాని, అమ్మిన గాని ఆక్రమించుట గాని చట్ట ప్రకారము చెల్లనేరదు. కావున వీరిపై చట్టప్రకారము చర్యలు తీసుకోనబడును అని పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయడము అయినది.

P. LAKSHMI DEVI, Member
Creative Edurational Society. Kumool
Cell. 8142233368
S.GHANI BASHA, B.A., BL
Advocate Kurnool

గర్భిణులకు పోషకాహారం అందించండి


మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా


హాజరైన అధికారులు

- తక్కువ బరువున్న 4118 మంది చిన్నారులను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలి
- బాల్య వివాహాలను వంద శాతం అరికట్టాలి

కర్నూలు(సెంట్రల్): గర్భిణులకు పోషకాహారం తప్పనిసరిగా అందించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ అంశాలపై మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖాధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోషకాహారాన్ని అందిస్తున్న గర్భిణుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం లేదని, పోర్టల్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. జిల్లాలో తక్కువ బరువు ఉన్న 4118 మంది పిల్లలను రానున్న 2, 3 నెలల్లో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బాలామృతం తీసుకుంటున్నా ఎందుకు తక్కువ బరువు ఉన్నారని అంగన్‌వాడీలను ప్రశ్నించారు. పిల్లల ఎత్తు, బరువు కొలతలు ఏ విధంగా నమోదు చేయాలన్న అంశంపై కొంతమంది అంగన్‌వాడీ వర్కర్లకు అవగాహన లేక తప్పుగా కొలుస్తున్నారని సీపీడీఓలు, సూపర్‌వైజర్లుగా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వారికి అర్థమయ్యేలా ఓ వీడియోను రూపొందించాలని ఐసీడీఎస్ పీడీ నిర్మలను ఆదేశించారు. దేవనకొండ మండలం తెర్నేకల్ క్లస్టర్‌లో తక్కువ బరువు, తక్కువ ఎత్తు ఉన్న పిల్లల సంఖ్య కూడా తెలియకుండా సూపర్‌వైజర్ ఉండడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కనీసం డేటా కూడా తెలియకుండా ఎలా పనిచేస్తారని ప్రశ్నించారు. ఆమెకు షోకాజ్ నోటీసు ఇవ్వడంతో పాటు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాల్య వివాహాల నిరోధానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి పాల్గొన్నారు.

పూడికతీత ముమ్మరంగా చేపట్టాలి

కర్నూలు (టౌన్): నగరంలోని మురుగు కాల్వల్లో పూడికతీత ముమ్మరంగా చేపట్టాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదేశించారు. మంగళవారం స్థానిక 1వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ షేక్షావలితో కలిసి కమిషనర్ వార్డులో పర్యటించారు. చిదరంబరరావు వీధి, నాగమయ్య కట్ట, రాఘవేంద్ర మఠం తదితర ప్రాంతాల్లో మురుగు కాల్వలను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ నూతనంగా మురుగు కాల్వల నిర్మాణం, ప్రధాన మురుగు కాల్వ ల అనుసంధానం చేపట్టాల్సిన అవసరం ఉందన్నా రు. ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఎంఈ సత్యనారాయణ, డీఈఈ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన కమిషనర్

కర్నూలు నగరంలోని ఆటోనగర్‌లో నంద్యాల పార్లమెంటు సభ్యురాలు బైరెడ్డి శబరిని మంగళవారం నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కల్లూరు అర్బన్‌కు సంబంధించిన పలు సమస్యలపై చర్చించారు.

పదవీ విరమణ అధికారికి సన్మానం

నగరపాలక సంస్థలో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన అసిస్టెంట్ ఎగ్జామినర్ చక్రపాణిని కమిషనర్ రవీంద్రబాబు నగరపాలక కార్యాలయంలో శాలువాలు, పూల దండలతో ఘనంగా సత్కరించారు. మేనేజర్ చిన్నరాముడు, ఎగ్జామినర్ సుబ్రమణ్యం, అకౌంట్స్ ఆఫీసర్ చుండీ ప్రసాద్ పాల్గొన్నారు.


చిదరంబరరావు వీధిలో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

వరి రైతులకు ఊరట

- కర్నూలు మార్కెట్‌లో వరి ధాన్యం క్రయ, విక్రయాలకు చర్యలు
- ఈ మేరకు మిల్లర్లతో సమావేశం
- త్వరలో కొనుగోళ్లపై నిర్ణయం
- మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో వరి ధాన్యం క్రయ విక్రయాలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. మంగళవారం మార్కెట్ యార్డులోని సెక్రటరీ చాంబరులో మిల్లర్లతో సమావేశమై మార్కెట్ యార్డులో ధాన్యం క్రయవిక్రయాలు నిర్వహించడంపై చర్చించారు. ధాన్యం కొనుగోలుకు ఉన్న అవకాశాలను, సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు సానుకూలంగా స్పందించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వరి ధాన్యం ప్రధాన ఆహార పంట, అయితే మార్కెటింగ్ సదుపాయం లేదు. రైతులు దళారీలకు విక్రయించుకుంటూ నష్టపోతున్నారు. ఈ నేపథ్యంతో మార్కెట్‌లో ఈ-నామ్ ద్వారా రహస్య టెండరు విధానంలో వరి ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టినట్లు సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. మిల్లర్లతో మరింత లోతుగా చర్చించి త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న తదితరులు పాల్గొన్నారు.



మిల్లర్ల సమావేశంలో మాట్లాడుతున్న సెక్రటరీ జయలక్ష్మి

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు: కల్లూరు మండలం గణేష్ నగర్‌లో నివాసముంటున్న (ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ కాలనీ) ఆదిశేషయ్య కుమారుడు మధు (38) రైలు కింద పడి మృతి చెందాడు. ఇతను గౌండ కింద కూలి పని చేస్తూ జీవనం సాగించేవాడు. సోమవారం రాత్రి కర్నూలు శివారు గుత్తి పెట్రోల్ బంకు వద్ద అభయ ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో రైలు ట్రాక్‌పై అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కర్నూలు రైల్వే పీఎస్ ఎస్‌ఐ కిరణ్ బాబు ఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించాడు. అతని జేబులో ఉన్న గుర్తింపు కార్డు ఆధారంగా మధుగా గుర్తించారు. రైలు పట్టాలు దాటే క్రమంలో ప్రమాదానికి గురై ఉండొచ్చని, లేక అనారోగ్య కారణాల వల్ల ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాదంలో మృతదేహం నుజ్జునుజ్జయ్యింది. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి భద్రపరచినట్లు ఎస్‌ఐ తెలిపారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామని, మృతికి గల కారణాలు విచారించి కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

విజేతలకు అభినందన

కర్నూలు కల్చరల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సౌజన్యంతో రాయలసీమ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన వర్సిటీ విద్యార్థులను ఆర్‌యూ ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ విజయకుమార్ నాయుడు, వర్సిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.నాగరాజు అభినందించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ మాట్లాడుతూ.. బాల్య వివాహాలు, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, మానవ అక్రమ రవాణా, ర్యాగింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. వర్సిటీ విద్యార్థులు 14 మంది విజేతలుగా నిలిచారన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.


విజేతలతో ఆర్‌యూ వీసీ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ విజయకుమార్ తదితరులు